విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

మా భూములు ఇప్పించండి మహాప్రభో....

విశాలాంధ్ర - పద్మనాభం: తమ భూములను తమకు ఇప్పించాలని కోరుతూ మండలం పాండ్రంగి పంచాయతీ బర్లపేట గ్రామానికి చెందిన గ్రామస్తులు తహశీల్దార్‌కు విన్నవించారు. సర్వే నెంబరు 42లో ఒకటి, సర్వే నెంబరు 42లో రెండులో సుమారు 10 ఎకరాల భూమి ఉంది. సుమారు నాలుగు తరాల పూర్వం నుండి మా గ్రామంలో రైతులు పంటలు పండించుకొనుటకు, గొర్రెల మంద, పాడి పశువుల కల్లాలుగా ఉపయోగించుకోవడానికి ఇతర ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. 1990లో స్థానిక మండల రెవెన్యూ రికార్డుల్లో కూడా గ్రామస్తుల పేరును నమోదు చేయడం జరిగింది. మా పూర్వీకులు నిరక్షరాస్యులు కావడం వల్ల రుపాకుల రవికుమార్ అనే వ్యక్తి గవర్నమెంట్ వారు ఈ భూమి తమకు ఇచ్చారని కాబట్టి మీ అందరూ ఈ భూమిని ఖాళీ చేయించాలని చెప్పి పోలీసులు ద్వారా మమ్మల్ని అక్కడి నుంచి ఖాళీ చేయించారని తెలిపారు. మా పిల్లలపై పోలీసు కేసు నమోదు చేయించి ఇబ్బంది పెడుతున్నాడని అన్నారు. కావున విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రజల్లోకి జగనన్న సురక్ష పథకం

విశాలాంధ్ర -గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు పరిధిలో ఉన్న 458, 459, 460, 476, 477, 478, 479 సచివాలయాలలో కన్వీనర్లు, వాలంటరీలు, గృహసారధులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. 91వ అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు జి.అప్పలస్వామి నాయుడు, త్రినాధ్ రాజేష్, తేజ జగనన్న సురక్ష పథకంపై వివరించారు. 91వ వార్డు పరిధిలో 471, 472, 481 సచివాలయులకు ఈనెల 6వ తేదీ బాజీ జంక్షన్ రాజీవ్ మినీ కళ్యాణ మండపంలో, 48, 482, 483 సచివాలయాలకు సంబంధించి గోపాలపట్నం జడ్పీహెచ్ స్కూల్ ఇండోర్ స్టేడియం నందు, 92వ వార్డు పరిధిలో ఉన్న 458, 459, 460 సచివాలయాలకు సంబంధించి ఈనెల 11న కంపరపాలెం 459 సచివాలయం దగ్గర, 476, 477, 478,479 సచివాలయాలకు సంబంధించి గోపాలపట్నం జడ్పీహెచ్ స్కూల్ ఇండోర్ స్టేడియం నందు దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేయడం జరుగుతుందని అన్నారు.

జిల్లాలో సమర్థవంతంగా జగనన్న సురక్ష: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: శనివారం నుండి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకాన్ని సమర్ధ వంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి నిర్వహించిన మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందించవచ్చని, తద్వారా ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ముందుగానే వాలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల అవసరాలు గుర్తించి సచివాలయాల ద్వారా 11 రకాల ధ్రువపత్రాలు జారీకి చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలక్టర్ జే.శివ శ్రీనివాసు, సహాయ కలక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, మండల ప్రత్యేకాధికారులు వి.మురళి, కొండలరావు, వి.ఎస్.కుమార్, వి.గోవింద రాజులు, ఎన్.సూర్య లక్ష్మి, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ దబ్బలపాడు గ్రామంలో జగనన్న సురక్షపై మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షులు రేగబోయిన స్వామి అవగాహన కల్పించారు. జగనన్న సురక్ష ద్వారా ప్రతిఒక్కరూ 10 రకాల సేవలు లబ్ధి పొందాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కుల ధృవీకరణ పత్రము, ఆదాయం ధృవీకరణ పత్రం, జనన ధృవీకరణ పత్రము, కుటుంబ ధృవీకరణ పత్రము పత్రము, మరణ ధృవీకరణ పత్రము, వివాహ దృవీకరణ పత్రము, కొత్త రేషన్ కార్డులు రేషన్ కార్డులు విభజన, మ్యూటేషన్స్, ఫోన్ నెంబర్ ఆధార్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు తదితర సేవలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో చిలకలగెడ్డ సర్పంచ్ అప్పారావు, మార్కెట్ డైరెక్టర్ కొర్ర సూర్యనారాయణ, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మధుసూదన్‌రావు, గుమ్మ కన్వీనర్ గంగరాజు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన చిక్కాల రామారావు

విశాలాంధ్ర - పాయకరావుపేట: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని విజయవాడలో జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ చిక్కాల రామారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్ నాథ్, వైసిపి అనకాపల్లి జిల్లా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన బొడ్డేడ ప్రసాద్ ఉన్నారు.

ఘనంగా కృష్ణమయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి పరమపద భక్తుడు, తొలి తెలుగు వాగ్గేయ కారుడు శ్రీకాంత కృష్ణమయ్య జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇన్‌చార్జ్ కార్య నిర్వహణాధికారి వి.త్రినాధరావు ఆదేశాల మేరకు సహాయ కార్య నిర్వాహణాధికారి సూర్య భ్రమరాంబ, ప్రధాన అర్చకులు జి.శ్రీనివాసాచార్యులు, పర్యవేక్షకులు వి.నరసింగరావు ఆధ్వర్యంలో స్వామివారి బేడామండపంలో ఉన్న కాంతకృష్ణమయ్య విగ్రహం వద్ద ఆగమశాస్త్ర ప్రకారం ప్రత్యేక పూజలు జరిగాయి.

పాల సంఘం సొసైటీ అధ్యక్షునిగా పాము

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండల కేంద్రంలోని పాల సంఘం సెక్రటరీ గండి జోగినాయుడు ఆధ్వర్యంలో పాలసంఘం ఎన్నికలను నిర్వహించారు. సొసైటీ అధ్యక్షునిగా పాము వెంకటకృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక పాలసొసైటీ కేంద్రం వద్ద మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఇద్దరు పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలసంఘం రైతులు పాల్గొన్నారు.

2న ఎల్‌టిపిల సంఘ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గుంటూరు జిల్లా నరసరావుపేటలో జూలై 2 తేదీన జరిగే రాష్ట్ర లైసెన్సుడ్ ఇంజనీర్స్, టెక్నికల్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి సభ్యులంతా తప్పనిసరిగా పాల్గోవాలని విశాఖపట్నం జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ కాళీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ కుమార్, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పురపాలక శాఖ డైరెక్టర్ విద్యుల్లత హాజరవుతారు అన్నారు. వారి సమక్షంలో రాష్ట్ర టౌన్ ప్లానింగ్ విభాగంలో తలెత్తుతున్న సమస్యలపై చర్చ ఉంటుందని తెలియజేశారు.

జలవిహార్‌లో అక్రమ కట్టడం తొలగింపు

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రఖ్యాతిగాంచిన చాపరాయి జల విహార్‌లో నిర్మించ తలపెట్టిన అక్రమ కట్టడాలపై స్థానిక రెవెన్యూ అధికార యంత్రాంగం శుక్రవారం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధ నలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలను నిర్మిస్తున్న ఓ వ్యక్తి కట్టడాలను డుంబ్రిగుడ తసశీల్దార్ సిహెచ్ నాగమ్మ సమక్షంలో ప్రొక్లెయినర్‌తో కూల్చి వేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు జి.హరి, పి.కామరాజు పాల్గొన్నారు.

జేవీకే కిట్లు ప్రతిఒక్క విద్యార్థికి అందజేయండి

విశాలాంధ్ర - అరకులోయ: విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న జేవీకే కిట్లను ప్రతి ఒక్కరికి అందే విధంగా ఉపాధ్యాయులు చూడాలని స్థానిక లోతేరు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శక్తి నారాయణ చెప్పారు. మండలంలోని గాతపాడు ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద గిరి విద్యార్థులు ఎలిమెంటరీ స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు చదవడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్య క్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు నియామక పత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - మల్కాపురం: జోన్-5లో నూతనంగా నియమితులైన వాలంటీర్లకు వైసీపీ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ శుక్రవారం తన కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాలంటీర్లు సైనికులు లాగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత వాలంటీర్లపైనే ఉందని అన్నారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, రీజినల్ కేడియం అధ్యక్షులు బద్రీనాథ్, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ మెంబర్ మాధవి, కార్పొ రేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లుకు వీడ్కోలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో బోయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో బాధ్యతలు నిర్వర్తించిన ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లుకు బదిలీ కావడంతో గంభీరం వైస్ ఎంపీపీ బోట్ట ధనలక్ష్మి రామకృష్ణ, నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బోయపాలెం గ్రామంలో ఉన్న పాఠశాలలో పిల్లలకు విద్యాబుద్ధులు, మంచి నడవడిక, క్రమశిక్షణ ద్వారా పిల్లలను విద్యావంతులు చేయడంలో ఆయన కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉప్పాడ సూరిబాబు, మాజీ ప్రెసిడెంట్ తెడ్లాపు గోవింద్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

గాజువాక ఎంఈఓను కలిసిన జిప్సా

విశాలాంధ్ర - గాజువాక సిటీ: ఇటీవల నూతనంగా గాజువాక మండల విద్యాశాఖాధికారిణిగా బాధ్యతలు చేపట్టిన పి.సునీతని గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల్లో పలు సమస్యలు ఆమెతో చర్చించారు. పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలని కోరారు. కార్యక్రమంలో జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్, మురళి, సత్య నారాయణ, చంద్రమౌళి, ప్రసాద రావు పాల్గొన్నారు.

ఏయూలో సింబయాసిస్ చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగంలో చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు సింబయాసిస్ టెక్నాలజీస్ సంస్థ ముందుకు వచ్చింది. శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహనికి సింబయాసిస్ టెక్నాలజీస్ సిఈఓ ఓరుగంటి నరేష్ కుమార్ రూ.12 లక్షలు చెక్కును అందజేసారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి, నూతన ప్రాజెక్టులను చేపట్టిన వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి సేవలు ఈ సందర్భంగా సింబయాసిస్ టెక్నాలజీస్ సిఈఓ నరేష్ కుమార్ కొనియాడారు. కార్యక్రమంలో ఏయూ అకడమిక్ సెనేట్ సభ్యులు డాక్టర్ కుమార్ రాజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల అదనపు భారాలు రద్దు చేయాలి: వామపక్షాలు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: విద్యుత్ చార్జీల అదనపు భారాలు రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో అనకాపల్లి నెహ్రూ చౌక్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహించారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డీఈఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ విద్యుత్ భారాలతో పేద, మధ్య తరగతి ప్రజలు అల్లాడుతున్నారని ఆగ్రహించారు. స్మార్ట్ మీటర్లు ఎవరిని ఉద్ధరించడానికి పెడుతున్నారని ప్రశ్నించారు. అదానీ, షిర్డీ సాయి కంపెనీలు కోసం ప్రజలను దోచుకుంటారా అని ప్రశ్నించారు. వ్యవసాయానికి కూడా మీటర్లు పెట్టి ఉచిత విద్యుత్ రద్దు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజలపై భారాలు వేసి, కార్పోరేట్లకు లాభాలు తెచ్చిపెట్టే మోడీ, జగన్‌ల దొంగ నాటకాలను ప్రజలు గమనించాలని కోరారు. ఈ నిర్ణయాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో విద్యుత్ ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కన్వీనర్ పి.ఎస్.అజయ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదిర్శవర్గ సభ్యులు జి.కోటీశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.దొర బాబు, సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, సిపిఎం అనకాపల్లి మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, సిపిఐ అనకాపల్లి పట్టణ కార్యదర్శి వై.ఎన్.భద్రం, సిపిఎం నాయకులు ఆర్.శంకరరావు, కె.ఈశ్వరరావు, జి.సుభాషిణి, కె.తేల్లయ్యబాబు, సిపిఐ నాయకులు తాకాసి వెంకటేశ్వరరావు, కె.శంకరరావు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని శుక్రవారం వామపక్షాలు నిరసన తెలిపాయి. స్థానిక మూడు రోడ్ల కూడలిలో సీపీఐ, సీపీఎం పార్టీల నేతలు పెరిగిన విద్యుత్ చార్జీల వివరాలు ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చార్జీలను దారుణంగా పెంచారని రెండు నెలల కాలములో ప్రజలకు తెలియకుండా సర్ చార్జీల రూపములో సామాన్యుడు నడ్డి విరగ్గొట్టాడన్నారు. పెరిగిన చార్జీలను వెంటనే తగ్గించాలని లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెపుతారని ఆ పార్టీల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేచలపు కాసుబాబు, గొర్లె దేవుడు బాబు ఎర్ర దేముడు, ఈర్లి నాయుడుబాబు, రెడ్డి అప్పల నాయుడు, దమ్ము ముత్యాల నాయుడు, వర్రీ అప్పారావు, కోటి, గాడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. శుక్రవారం గాజువాక పరిధి ఆటోనగర్ సబ్ స్టేషన్ వద్ద సీపీఐ, సీపీఎం, ఐ.ఎఫ్.టి.యూ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీపీఐ గాజువాక నియోజక వర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా విద్యుత్ ఛార్జీలు పెంచడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఐ.ఎఫ్.టి.యూ నాయకులు కె.మల్లయ్య, వామపక్ష పార్టీల నేతలు పల్లే టి.పోలయ్య, జి.ఆనంద్, వై.నందన్న, అప్పారి విష్ణు మూర్తి, పి.దుర్గారావు, సోమేష్, శ్రీనివాస రాజు, లక్ష్మణరావు, లోకేష్, గొలగాన అప్పారావు, బి.గురప్ప, జి.అప్పారావు, ఐద్వా నాయకురాలు జె.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: రాంబిల్లి మండలం కరెంటు సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో సర్దుబాటు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంటు చార్జీలను రద్దు చేయాలని ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు మాట్లాడుతూ ఇప్పటికే 1400 కోట్ల రూపాయలు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం వేసిందని, సర్దుబాటు పేరుతో మరో ఆరువేల కోట్ల రూపాయలు పెంచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. పెంచిన కరెంటు చార్జీలు వెనక్కి తీసుకోకపోతే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.నారాయణ రావు, సి.హెచ్ నూకన్నా, వై.రాము, సిహెచ్ రామకృష్ణ, డి.కాసియా, రాంబాబు, అప్పారావు, వరహాల రావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ రంగ సంస్కరణలకు తలొగ్గిన జగన్ ప్రభుత్వం ఇష్టానుసారం కరెంట్ రేట్లు పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపుతోందని వామపక్షాలు మండిపడ్డాయి. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పెందుర్తి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఏ.రమణ, కే. నారాయణ రావు, రజిని, అనురాధ, సింహరావు, సిపిఎం నాయకులు జగన్. రమణి, అప్పలనాయుడు, సిపిఎంఎల్ నాయకురాలు నిర్మల,ఇందిరలతో పాటు పెద్దసంఖ్యలో మహిళలు, వామపక్ష కార్యకర్తలు పాల్గొని ఆందోళన చేశాయి. స్మార్ట్ మీటర్లు మాకొద్దు అంటూ నినాదాలు చేసారు. ఏలేవాడికి బుద్ధే లేదా.. పెరిగే ధరలకు హద్దే లేదా...అని నినదించారు. జనం నెత్తిన నిప్పులు పోసే మోదీ పాలన చూడన్నా అంటూ పాటలతో హొరెత్తించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీ సత్యన్నారాయణకు వినతిపత్రం అందజేసారు.

నర్సీపట్నం: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణే ఉపసహరించుకోవలని, స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో నర్సీపట్నం బోడ్డేపల్లి సెంటర్ నుండి ర్యాలీ చేపట్టారు. డివిజనల్ విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి నిరసన చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విధానాలను, రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి భుజానికి ఎత్తుకొని విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తున్నార న్నారు. ఇందులో భాగంగానే కరెంటు చార్జీలు మెత అన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పిసిసి నాయకులు మీసాల సుబ్బన్న, సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి నాయకులు ఎల్‌వి రమణ, సీపీఎం సీనియర్ నాయుకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్.గౌరీ, కెవీ సూర్యప్రభ, డి.శివ, సిపిఐ నర్సీపట్నం టౌన్ కార్యదర్శి జి.గురిబాబు, ఎస్.కొండలరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మేకా సత్యానారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు జి.మాణిక్యం పాల్గొన్నారు.

పాయకరావుపేట: పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సబ్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ డెలిగేట్ జగతా శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జున్‌రావు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలతో ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలతో బిల్లులే షాక్ కొడుతున్నాయన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రు అప్, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బందుల సుబ్బలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేషన్ సభ్యులు మోర్త సింహాచలం, పట్టణ అధ్యక్షుడు పోలవరపు అప్పలరాజు, చీడిపల్లి చక్రవర్తి, దార్ల సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: విద్యుత్ చార్జీలపై సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో చిట్టివలస సబ్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. సీపీఎం నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన 4 సంవత్సరాల్లో ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెరిగాయని ట్రూ అప్ చార్జీలు పేరిట సామాన్య ప్రజల్ని దోచుకు తింటున్నారని అన్నారు. రైతులకు నష్టం చేసే విధంగా స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన ప్రభుత్వం మానుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ నుండి అల్లు బాబురావు, అప్పలరాజు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు పేరిట రకరకాల చార్జీలు పేరిట సామాన్య ప్రజలపై 6000 కోట్ల రూపాయలు భారం వేస్తున్నారని అన్నారు. వెంటనే పెంచిన చార్జీలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రవ్వ నర్సింగరావు ఎస్ అప్పలనాయుడు భాగం లక్ష్మి అన్నా బత్తుల నర్సింగరావు స్వామి వెంకట్ ఏరి చిట్టిబాబు గంట నరసింగరావు, మగటేశ్వరరావు, పూసల రామారావు, సిపిఐ పార్టీ నుండి కానూరు రాంబాబు, మా ఊరు వీర్రాజు, మోర్ అప్పలరాజు, నూలు ఆదినారాయణ, తూతుక సోమ రాజు, తదితర నాయకులు పాల్గొన్నారు. అనంతరం చిట్టివలస సబ్ స్టేషన్ ఏఈకి వినతి అందించారు.

చోడవరం: పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో అఖిలపక్షాలతో కలిసి శుక్రవారం చోడవరం సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. రెడ్డిపల్లి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు విద్యుత్ సంస్థలను అప్పజెప్పాలని ఆలోచనలో ఉన్నారని, కేంద్రంలో ఉన్న బిజెపి ఆర్ఎస్ఎస్ మరియు రాష్ట్ర ప్రభుత్వం లో ఉన్న వైసిపి కలిపి ఆదాని కంపెనీకి విద్యుత్ సంస్థని ముట్ట చెప్పే పద్ధతిలో ఆలోచన పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, సర్చార్జీలు సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని స్మార్ట్ మీటర్ బిగింపు కార్యక్రమాన్ని విరమించుకోవాలని ఎలక్ట్రికల్ ఏఈకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ సవరాలు గణేష్, రైతుకూలీ సంఘం మహిళా సమైక్య జిల్లా సహాయ కార్యదర్శి గోవాడ కనకమాలక్ష్మి, ఆబోతు శ్రీనివాసరావు, సమాధుల దేవి, కురువాడ శీను, కానూరు జగదీశ్వరరావు, కళ్యాణ్, లక్ష్మి పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించేందుకే జగనన్న సురక్ష పథకం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్

విశాలాంధ్ర - పరవాడ: ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే సీఎం జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. లంకెలపాలెం జయ రెసిడెన్సీ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి విప్లవాత్మక కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు, ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను చేరువ చేయాలన్న ఆలోచనతో జూలై 1 నుంచి రాష్ట్రమంతటా జగనన్న సురక్ష పథకం అనే సరి కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించి 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందించనున్నారని వెల్లడించారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు పరవాడలో తాను జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, పైల శ్రీనివాసరావు, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, కొటాన రాము, పూర్ణానంద శర్మ, కింతాడ ఈశ్వరరావు, బండారు కృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ ఫార్మాలో మృతులకు రూ.50 లక్షలు ఇవ్వాలి

ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాంబిల్లి సాహితీ ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారికి ఒక్కరికి 50 లక్షలు నష్టపరిహారం, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, వారు తిరిగి విధుల్లోకి వచ్చేంత వరకు వారికి సెలువుతో కూడిన జీతభత్యాలు ఇవ్వాలని, వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. అచ్యుతాపురం కంపెనీలో తరచు ప్రమాదాలు ప్రభుత్వ అధికారుల అలసత్వం వల్లే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు.

40 కిలోల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో గల మారుమూల భూసిపుట్ పంచాయతీ పరిధిలో నుండి కుమడ మీదుగా ఒడిశా రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 40 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు గంజాయి నిందితులను అదుపులో తీసుకున్నట్లు స్థానిక ఎస్సై కే.రవీంద్ర తెలిపారు. శుక్రవారం ఉదయం అక్రమ రవాణా జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు కుమడ పంచాయతీ కేంద్రంలో ఏఎస్ఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో భూసిపుట్ వైపు నుండి ఎఫ్‌జెడ్ బైక్‌తో పాటు ఓడి 10 ఆర్ 23 96 ఎఫ్ జెడ్ బైక్ ఎంబీఎల్ హెచ్ ఆర్ జైజి ఈ 23 37 5 డీలక్స్‌లతో రెండు ప్లాస్టిక్ సంచులతో అక్రమ రవాణా తరలిస్తున్న సమయంలో పట్టుబడినట్టు తెలిపారు. గంజాయి విలువ మార్కెట్ ధర ప్రకారంగా 80 వేల రూపాయలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడిన మాకవరం పంచాయతీ మేబా గ్రామానికి చెందిన జుర్లోయ్ చంద్రశేన్, డ్రైవర్ దేవ గొల్లూరి, కుమ్మరిపుట్ గ్రామం బిల్లా పుట్టు పంచాయతీ కొర్రపుట్ జిల్లా ఒడిస్సా అనంత గొల్లోరి లవ్ గూడాలు అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి, ఏపీఎస్పీ పోలీసు బాల పాల్గొన్నారు.

జీవీఎంసీకి రూ.4.48 కోట్లు ఆస్తి పన్ను చెల్లించిన స్టీల్‌ప్లాంట్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆస్తిపన్ను చెల్లింపులో భాగంగా జీవీఎంసీ గాజువాక జోన్ 6 రెవెన్యూ అధికారుల కృషి మేరకు శుక్రవారం 2023 - 24 సంవత్సరంనకుగాను స్టీల్ ప్లాంట్, బెల్ సంస్థల నుండి రూ.4.48 కోట్ల ఆస్తి పన్నును చెక్కు రూపంలో జోనల్ కమిషనర్ సింహాచలంకు అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ రామనారాయణ, ఆర్ఐలు శ్రీకాంత్, శివతో పాటు సచివాలయ అడ్మిన్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులను కమిషనర్ సాయి కాంత్ వర్మ అభినందించారు.

ప్రభుత్వం మంజూరు చేసిన తలుపులు, కిటికీలు ఇష్టపడని లబ్ధిదారులు

- ఏడాదిగా ఒకేచోట ఉండడంతో తలుపులు, కిటికీలకు చెదలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు ప్రభుత్వం మంజూరు చేస్తున్న తలుపులు, కిటికీలు ఇళ్లకు అమర్చుకునేందుకు ఇష్ట పడడం లేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు అవసరమై సరఫరా అయిన తలుపులు, కిటికీలు ఉపయోగించక ఏడాదిగా ఒకే చోట ఉంటూ చెదలు పడుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక జగనన్న కాలనీల పేరుతో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి సిమ్మెంటు, ఇనుము, తలుపులు, కిటికీలు, పైపులు తదితర ప్రభుత్వం సరఫరా చేసింది. అయితే వీటిలో సిమ్మెంటు, ఇనుము తీసుకున్న లబ్ధిదారులు తలుపులు, కిటికీలు తీసుకునేందుకు కొంతమంది ఇష్ట పడడంలేదు. దీంతో సరఫరా అయిన తలుపులు, కిటికీలు గోడౌన్‌కు పరిమితమయ్యాయి. మండలంలోని పీఎల్‌పురం గ్రామ సమీపంలో వేసిన మెగా లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సరఫరా అయిన తలుపులు, కిటికీలు పీఎల్‌పురం గ్రామంలో ఒక ప్రదేశంలో పడేశారు. ఇవి గత ఏడాదిగా వినియోగించ లేదు. అక్కడ నుండి కదలించక పోవడంతో ఎండలకు ఎండిపోయి, వర్షాలకు తడిసిపోయి చెదలు పట్టి పాడవుతున్నాయి. రూ.2,982 విలువైన డోర్ ఫ్రేమ్‌లు 740 మంజూరు కాగా 280వరకు మిగిలిపోయాయి. రూ.3,374 విలువైన తలుపులు 660 మంజూరు కాగా 340 మిగిలిపోయాయి. రూ.3,600 విలులైన కిటికీలు 1118 మంజూరు కాగా 610 మిగిలిపోయాయి. అలాగే వాటర్ ట్యాంకులు, పైపులు, టాయిలెట్ డోర్‌లు కొన్ని మిగిలిపోయి ఉన్నాయి. మిగిలిపోయిన వాటిని గోడౌన్‌లలో భద్రపరచాల్సిన హౌసింగ్ అధికారులు ఉపయోగించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో రోడ్డు పక్కన పడేశారు. దీనిపై హౌసింగ్ సిబ్బందిని ప్రశ్నించగా పీఎల్‌పురం గ్రామంలో ఉన్న తలుపులు, కిటికీలను గోడౌన్‌కు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్ల కొనుగోలు ప్రాధాన్యతపై స్కోడా ఆటో సర్వే నివేదిక

విశాలాంధ్ర- విశాఖ సిటీ: కార్ల కొనుగోలు ప్రాధాన్యత అంశాలపై స్కోడా ఆటో ఇండియా ఓ సర్వే చేసినట్టు వెల్లడించింది. సర్వే ఎన్ ఐ క్యు బేసెస్ ద్వారా నిర్వహించబడిందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. 92 శాతం కస్టమర్లు భారతదేశంలోని కార్లను క్రాష్-టెస్ట్ చేసి, సేఫ్టీ రేటింగ్ ఇవ్వాలని కోరుకుంటున్నారన్నారు. 47.6 శాతం కస్టమర్‌లు కారులోని ఇతర ఫీచర్‌ల కంటే భద్రతకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. కారు కొనుగోలు నిర్ణయానికి సంబంధించిన ప్రాధాన్యతల జాబితాలో క్రాష్-రేటింగ్ అగ్రస్థానంలో ఉందని, కారు కొనుగోలు నిర్ణయం కోసం ఇంధన సామర్థ్యం మూడవ స్థానంలో ఉంటుందన్నారు.

సాయిచంద్ మృతికి సంతాపం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ , ప్రముఖ కళాకారుడు సాయి చంద్ ఆకస్మిక మృతి పట్ల విశాఖ ఉక్కు కర్మాగారం లోని తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కళాకారుడిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సాయి చంద్ లేరనే వార్త కలచి వేసిందని సంఘం అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఎస్.కుమారస్వామి , జి.ఆనంద్ అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సమయంలో ధూం ధాం కార్యక్రమాలతో ప్రజలను చైతన్య పరిచారని సంఘం పేర్కొంది. అభ్యుదయ పాటలతో పాటు ప్రజల ను మేల్కొలిపే గేయాలను ఆలపించి దళిత , బడుగు ,బలహీన వర్గాలకు చేరు వ య్యారని సంఘం అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఎస్. కుమార స్వామి, జి. ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.

మన్యంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - జీకే వీధి: మన్యంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ పార్టీ జీకే వీధి మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మన్యంలోని వివిధ గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలతో పాటు, నాడు హుదూద్ తుఫాను కారణంగా నేలకొరిగిన వాలిపోయిన విద్యుత్ స్తంభాలు కొన్ని నేటికీ అదే స్థితిలో ఉన్నాయన్నారు. అవి ఏ సమయంలో విరుగుతాయో, కూలుతాయో తెలియని అయోమయ పరిస్థితి గిరిజన ప్రాంతంలో నెలకొందన్నారు. మండలంలోని ఏబులం, ఏబులం కుమ్మర వీధి, నేలపాడు జన్ని వీధి లతోపాటు మరికొన్ని గిరి గ్రామాలలో ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో విద్యుత్ స్తంభం పడి కొడిసింగి గ్రామంలో మర్రి నవీన్ అనే వ్యక్తి చనిపోవడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కొర్ర చంద్రమ్మ కంకిపాటి. రుషి, దార ప్రసాద్, హరిబాబు, సోదును తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి పట్టణ పరిధిలో ఉన్న అనేక సమస్యలను రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో పరిష్కరించడం జరిగిందని, ఇంకా కొన్ని సమస్యలు పరిష్కరించాలని జీవీయంసీ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి అనకాపల్లి జోన్ 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మీ రమేష్ శుక్రవారం వినతిపత్రం అందించి, సమస్యలను వివరించారు. సమస్యలు విన్న మేయర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

గిరి ప్రదక్షిణలో బాల కార్మికుల ద్వారా విక్రయాలు చేయొద్దు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఈనెల 2వ తేదీ ఆదివారం సింహాచలం గిరిప్రదక్షిణ సందర్భంగా బాల కార్మికుల ద్వారా ఎలాంటి విక్రయాలు జరుపవద్దని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు గిరి ప్రదక్షిణ శు భాకాంక్షలు తెలియజేసిన ఆమె బాల కార్మికుల హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. బాల కార్మిక నిరోధ చట్టం ప్రకారం 18 సంవత్సరాల వయసులోపగల బాల బాలికలను ఎలాంటి పనులలో నియమించుకున్న చట్టరీత్య నేరమని ఈ సందర్భంగా యజమా నులకు తెలియజేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన యజమానులకు రూ. 20,000 నుంచి రూ.50,000 వరకు జరిమానాలతో పాటు 6 నెలల జైలు శిక్ష సెక్షన్ 14 ప్రకారం విధించబడునని ఆమె ఈ ప్రకటనలో తెలియజేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దిశగా ప్రజలు వ్యాపారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్‌లో ఉపాధి శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (నేక్) ద్వారా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగ యువతకు ఉపాధి కొరకు అసోసియేట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో ఉచిత శిక్షణ ఉపాధి కల్పనకు దరఖాస్తులు కోరుతున్నట్లు నేక్ సహాయ సంచాలకులు ఎస్ వి ఎస్ ఎస్ రవికుమార్ తెలిపారు. పదవ తరగతి పాసై 15 నుండి 45 సం. లు వయసు గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. శిక్షణ మాకవరపాలెంలో జరుగుతుందని, స్టేషనరీ ఉచితంగా ఇస్తారని, రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుందని తెలిపారు. శిక్షణానంతరం సంబంధిత రంగంలో ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు 7780275922 లేదా 9394885164 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

ఎంఎల్ఎఎస్ఎస్ యాప్‌పై అవగాహన

విశాలాంధ్ర - చీడికాడ: ఆశవర్కర్లకు ప్రభుత్వం అందించిన మొబైల్‌లో ఎంఎల్ఎఎస్ఎస్ యాప్ ను విధిగా డౌన్లోడ్ చేసుకోవాలని వైద్యులు అప్పారావునాయుడు అన్నారు. మండలంలోని పెదగోగడ హాస్పిటల్‌లో శుక్రవారం ఆశ వర్కర్లకు యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశవర్కర్లు ప్రతిరోజు గ్రామాల్లో తిరిగి మాతృ శిశు సంరక్షణ గర్భిణీలు బాలింతలు చిన్నపిల్లల యొక్క బయోడేటాను ఎప్పటికప్పుడు ఈ యాప్ లో అప్లోడ్ చేయాలి అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్‌సీ ప్రసాద్, సూపర్వైజర్ శకుంతల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సురక్ష ధృవపత్రాల జారీ

విశాలాంధ్ర - మధురవాడ : జీవీయంసీ 5వ వార్డు 15 సచివాలయాల పరిధి సురక్ష కార్యక్రమం లో వివిధ ధృవపత్రాలను జూలై 1 శనివారం అందజేయడం జరుగుతుందని నమోదుచేసుకున్న వారు ఉచితంగా పొందవలసింది గా జోన్2 జోనల్ కమిషనర్ కే.కనకమహాలక్ష్మి తెలిపారు. 5వ వార్డు లోని 35,37,68,69,70 మొత్తం 5 సచివాలయాల పరిధి వారికి 35వ వార్డు సచివాలయం వద్ద,71నుండి75 సచివాలయాలకు గాను 75వ సచివాలయం వద్ద,76 నుండీ 80సచివాలయాల పరిధి వారికి 78వ సచివాలయం వద్ద ఈ ధృవపత్రాలు అందజేస్తారన్నారు. జెడ్సీ శుక్రవారం 78వ వార్డు సచివాలయాన్ని సందర్శించి సురక్షలో ధృవపత్రాల జారీ ఏర్పాట్లను పరిశీలించి,సచివాలయ కార్యదర్శులకు సూచనలు చేసారు. ఈ కార్యక్రమం లో ఆమె తో పాటు సహాయ కమిషనర్ రమేష్, కొందరు ఆ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని జీడిగుప్ప, తుమ్మిలేరు గ్రామ పంచాయితీలో గల రాయిగుడెం గ్రామంలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ని జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, జీడిగుప్ప పంచాయితీ సర్పంచ్ ముట్ల బాలరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుంజా రమేష్, కదల కొండారెడ్డి, జనసేన యూత్ నాయకులు పెడపెట్ల పవన్ కళ్యాణ్, క్రీడాకారులు, టోర్నమెంట్ కమిటీ మెంబెర్స్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పబ్లిక్ వర్క్స్ ఎస్ఈ రాజారావు మృతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జీవీఎంసీలో అత్యధిక కాలం నీటి సరఫరా విభాగంలో డి ఈగా, ఈఈ పనిచేసే పదోన్నతి పొంది జీవీఎంసీలో పర్యవేక్షక ఇంజనీర్‌గా పనిచేసి ఇటీవల విశాఖలో పబ్లిక్ వర్క్ పర్యవేక్షణ ఇంజనీర్‌గా బదిలీ అయి విధులు నిర్వహిస్తున్న రాజారావు గుండెపోటుతో శుక్రవారం మెడికవర్ ఆసుపత్రిలో మృతిచెందారు. సహచర ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది వెళ్లి ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

కరెంటు బిల్లులతో ప్రజలకు షాక్

విశాలాంధ్ర - దేవరాపల్లి: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సిపిఐ దేవరపల్లి మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర సిపిఐ మండల కార్యదర్శి గరికిన రాజు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. రాజు మాట్లాడుతూ రాజకీయ అవినీతి పరులు పాలకులు కుమ్మక్కై రెండు మూడు రూపాయలకు కొనాల్సిన విద్యుత్తును బహిరంగం మార్కెట్లో 10 నుండి 20 రూపాయలకు కొంటున్నారని నష్టాలు వస్తున్నాయనే సాకుతో ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీల పేరుతో మునిగే నక్కపై తాటికాయ పడ్డట్టు విద్యుత్ పంపిణీ సంస్థలు తాజాగా మరోసారి గుట్టు చప్పుడు కాకుండా జనంపై మరో భారాన్ని మోపాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

వరిలో అధిక దిగుబడులు సాధించాలి

విశాలాంధ్ర - కే కోటపాడు: వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తారని జిల్లా వ్యవసాయ అధికారిబి మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఈ మండలం వారాడ గ్రామంలో క్లస్టర్ పొలంబడి నిర్వహించారు. వరి పంటలో ఉత్తమ వ్యవసాయ పద్ధతులను వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు వివరిస్తారని అన్నారు. ముఖ్యంగా వేసవి దుక్కులు, నాణ్యమైన విత్తనం , మట్టి పరీక్షలు, నీటి పరీక్షలు రైతుల చేత శాస్త్రవేత్తలు చేయించడం జరుగుతుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం ద్వారా 20 హెక్టార్ల పరిధిలో ప్రతి వారం పొలంబడి నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏ డి ఏ శ్రీధర్ , వి ఏ వోలు విజేత, తులసీమని, రిసోర్స్ పర్సన్ చిరంజీవి , వ్యవసాయ అధికారి సోమశేఖర్ రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలలను నెరవేర్చిన సీఎం

విశాలాంధ్ర - పెందుర్తి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నారని జీవీఎంసీ 95వ వార్డు కార్పోరేటర్ ముమ్మన దేముడు స్పష్టం చేసారు. మూడో విడత వై.యస్.ఆర్ ఆసరా నగదు లబ్ధిదారుల ఖాతాలోకి జమ అయిన సందర్భంగా వరలక్ష్మీనగర్ లో లబ్ధిదారులతో కలిసి శుక్రవారం సిఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ మహిళలు నినాదాలు చేసారు. కార్యక్రమంలో జీవీఎంసీ సీఈఓ కనకరత్నం, వైసీపీ నాయకులు గంట్ల నర్సింహామూర్తి, బొడ్డు దేముడుబాబు, అప్పికొండ రాంబాబు, గంట్ల లక్ష్మి, గోపాల్, భాగ్యలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: దుంబ్రిగూడ మండల నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ సిహెచ్. నాగమ్మకు జగనన్న సేవా ట్రస్ట్ వర్కింగ్ కమిటీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కే. నిర్మల శు క్రవారం శాలువా కప్పి సన్మా నించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ మండల గిరిజనుల భూ సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని తహసిల్దార్ నాగమ్మకు కోరారు. ఈ సందర్భంగా తహసిల్దార్ నాగమ్మ మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి శక్తికి మించి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మండల సమావేశం

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: గత సమావేశంలో చర్చ జరిగిన సమస్యలను పరిష్కరించకపోవడంతో పాటు శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారం లేకుండా సభకు హాజరై సభ్యులు అడిగిన సమస్యలపై స్పష్టమైన సమాధానం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, మేమేమైనా వెర్రి గొర్రెలు లాగా కనిపిస్తున్నామా! అడిగిన వాటిపై స్పష్టంగా పూర్తి సమాచారంతో సమాధానం ఇవ్వాలని స్థానిక మండల అధికారులపై ఎంపిటిసి సభ్యులు కే పాపారావు, దేవా, సర్పంచ్ పి కోములు,సర్పంచులు శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో స్థానిక ఐసిడిఎస్ అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ బి ఈశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో ఫిర్యాదు చేసిన సమస్యలను ఎన్ని పరిష్కరించారు! ఎన్ని పరిష్కరించ లేదు! అనే దానిపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సభ్యులు అధికారులను పట్టుబట్టారు. శాఖల వారీగా పూర్తి సమాచారం లేకుండా, గతంలో ఫిర్యాదు చేసిన సమస్యలపై కూడా స్పష్టత లేకుండా హాజరైన ఎందుకు ఉపయోగం ఉండదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా సరే అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో ఇది మండల సర్వసభ్య సమావేశమా! లేక !చెత్త సమావేశమా అంటూ అధికారులపై తీవ్రంగా సభ్యులు మండిపడ్డారు. ఈ సమావేశానికి స్థానిక సంబంధిత మండల స్థాయి అధికారులు హాజరు కావలసి ఉండగా ఐసిడిఎస్ సిడిపిఓ హాజరుకాకుండా సూపర్వైజర్లు హాజరయ్యారు. అయితే సభ్యులు అడిగిన ప్రశ్నలకు పూర్తిస్థాయిలో వారి వద్ద సమాచారం లేకపోవడంతో సభ్యులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సీట్ల సంఖ్యని పెంచాలని, అన్ని ఆశ్రమ పాఠశాలలు పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని సభ్యులు అధికారుల దృష్టికి ప్రజాప్రతినిదులు తీసుకువచ్చారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలను పూర్తిగా నిర్మించి , ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధంగా ఎంఈఓ పర్యవేక్షణ ఎప్పటికప్పుడు చేయాలని కంద్రుం, కోర్రాయి సర్పంచులు కే హరి, పి కొములు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఐటిడిఎ ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్న మొక్కలను ఆగస్టు లోపు రైతులకు పంపిణీ చేయాలని, ఆలస్యంగా పంపిణీ చేయడం వలన మొక్కలు నాటిన ఉపయోగం లేకుండా పోతుందని గసభ పంచాయితీ సర్పంచ్ పి సునీత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో నుంచి అక్రమంగా జరిగే పశు రవాణాలను అరికట్టాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ ఏ హెచ్ ఏ లు సక్రమంగా సమయపాలన పాటించి విధులు నిర్వర్తించే విధంగా పశువైద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుండాలని సభ్యులు చెప్పారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఎస్ ఆనంద్, పి లలిత, ఎంపీడీవో ఉషారాణి, తహసిల్దార్ నాగమ్మ, వైద్యాధికారి పి రాంబాబు ,ఎంఈఓ రామచంద్రరావు, ఎంపీటీసీలు, సర్పంచులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయంటూ మండలంలోని అరట్లకోట గ్రామానికి చెందిన పి.కన్న అప్పారావు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఏపీఓ హేమలత విచారణ నిర్వహించారు. మంచంలో ఉన్న మహిళ ఉపాధి పనులకు వచ్చినట్లుగా మస్తర్లు వేస్తున్నారని, ఉపాధి పనులకు రాని వారికి మస్తర్లు వేస్తున్నారని, ఒకరి జాబ్‌కార్డుపై మరోకరు పనులు చేస్తున్నారని, ఇష్టం వచ్చినట్లు జాబ్‌కార్డులు తొలగిస్తున్నారని, అవరసమైన వారికి జాబ్ కార్డులు ఇవ్వడం లేదని, జాబ్‌కార్డులు వచ్చినట్లుగా సమాచారం అందజేయడం లేదని తదితర పి.కన్న అప్పారావు ఏపీఓకు ఫిర్యాదు చేశారు. గ్రామ సర్పంచ్ పులగపూరి అప్పలనర్స, పంచాయతీ కార్యదర్శి డి.విజయ రాజు, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ కార్యాలయంలో ఏపీఓ హేమలత విచారణ నిర్వహించారు. మొత్తం 15మందిలో 12మందిని విచారణ నిర్వహించారు. ముగ్గురు విచారణకు హాజరు కాలేదు. ఇందులో 10మంది తాము ఉపాధి పనులు చేశామని, తమ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యిందని తెలిపారు. బ్యాంకు ఖాతాలో నగదు జమ అయిన తర్వాత ఉపాధి పనులకు రాలేదని ఎవరు ఒప్పుకుంటారని కన్న అప్పారావు అధికారులను ప్రశ్నించారు. అయితే మారెళ్ల అప్పనర్స అనారోగ్యం కారణంగా మంచంలో ఉండగా ఆమె ఉపాధి పనులు చేసినట్లుగా మస్తర్లు వేయడం, వులుగు సుభద్ర ఉపాధి పనులకు రాకపోయినా ఆమెకు బదులు కోడలు పనులోకి వస్తే సుభద్రకు మస్తరు వేయడాన్ని ఫిర్యాదు దారుడు కన్న అప్పారావు విచారణ దృష్టికి తీసుకురాగా విఆర్‌పి సీహెచ్ హరిబాబు తప్పు జరిగినట్లుగా ఒప్పుకున్నాడు. విచా రణను నివేదికను ఎంపీడీఓకు అందజేస్తానని ఏపీఓ హేమలత తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ తూ ము వెంకట రమణ, వేముల వెంకటేశ్వరరావు, తూము రమణ, ఉపాధి సిబ్బంది వీరబాబు, అచ్యుతరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ఆరోగ్య సంరక్షణ సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. ఆరోగ్య సేవలు మరింత మెరుగు పడాలన్నారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఐ సి డి ఎస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులతో మాట్లాడుతూ చిన్నారులకు, తల్లులకు పక్కాగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, జననీ సురక్షా పథకాల ప్రయోజనాలు లబ్దిదారులకు సక్రమంగా అందించాలని పేర్కొన్నారు. గర్భవతులు, బాలింతల గణాంకాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఐసిడి ఏస్ అధికారుల దగ్గర ఒకేలా ఉండాలని, వ్యత్యాసాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ వేయకపోతే సంబంధిత ఎ. ఎన్. ఎంను సరెండర్ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఐటిడిఏ పి ఓ సూరజ్ గనోరే, ఐసిడి ఏ స్ పథక సంచాలకులు ఎన్. సూర్య లక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ భాషా, పి. ఎం. యు, ప్రాజెక్టు అధికారి రాంగోపాల్, పాడేరు సిడిపి ఓ, ఝాన్సీ, పాడేరు, రంప చోడవరం డివిజన్ల సిడిపి ఓలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి: సీఐటీయూ

విశాలాంధ్ర - యలమంచిలి: అచ్చుతాపురం ఎస్ఈ జెడ్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. సాహితీ ఫార్మా కంపెనీలో ఈరోజు జరిగిన ప్రమాదంలో భువనేశ్వర్ కి చెందిన డి రమేష్,రాంబిల్లి మండలం జంగాలపాలెం చెందిన పైల సత్తిబాబు, అప్పారాయుడుపాలెంకి చెందిన నూకినాయుడు, విజయనగరం చెందిన తిరుపతి, రేబాకకు చెందిన ఎస్.రాజబాబు, నక్కపల్లికి చెందిన ఎస్ .అప్పారావు, కొండకొప్పాకు చెందిన పిల్లా సంతోష్ కుమార్‌లు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని అన్నారు. మంటలు ఆర్పుతుండగా ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది కూడా గాయాలయ్యాయన్నారు. ఫ్యాక్టరీలో లోడింగ్ జరుగుతుండగా పేలుడు సంభవించి ప్రమాదం జరిగి ఉదయం 11 గంటల నుండి మంటలు సంభ వించాయని దఫ దఫాలుగా పేలుడులు సంభవించడంతో చుట్టుపక్కల ఫ్యాక్టరీలో ఉన్న కార్మికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యా రన్నారు. కంపెనీలో జరిగిన పేలుడు పై విచారణ జరిపించి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జరిగిన ప్రమాదాలపై సమగ్రమైన దర్యాప్తుని సిట్టింగ్ జడ్జితో నిర్వహించాలని సిఐటియు తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన కార్మికులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని కార్మికులు ఎవరైనా చనిపోతే కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు రుత్తల శంకర్రావు ఉపాధ్యక్షులు రొంగలి రాము,జి.దేముడునాయుడు, మండల కార్యదర్శి సోమునాయుడులు డిమాండ్ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: మలేరియా నివారణా మాసోత్సవం సందర్భంగా జోనల్ కమీషనర్ సింహాచలం పెదగంట్యాడ మర్రిచెట్టు వద్ద ప్రజలకు అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పులి లక్ష్మీ భాయి మాట్లాడుతూ ఇంటిలో మనం చెత్తను తడి పొడి గా వేరు చేసి అందించి పరిసరాలను శు భ్రంగా ఉంచడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ కిరణ్ కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ నగేష్, మలేరియా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు

విశాలాంధ్ర - చీడికాడ: నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదగోగడ చీడికాడ ఖండివరం పశు వైద్యశాలల పరిధిలోని 15 వేల గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు వేశామని పెదగోగడ పశు వైద్యాధికారిని కేవియస్ రాఘవమ్మ అన్నారు. పలు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్సిడీ పోను కాకిజొన్న విత్తనాలు 5 కేజీలు 115 రూపాయలుకు, బొబ్బర్లు మూడు కేజీలు 75 రూపాయలకీ, మొక్కజొన్న విత్తనాలు 5 కేజీలు 85రూపాయలకు అందిస్తున్నామన్నారు.

2న మాలమహానాడు సమవేశం

విశాలాంధ్ర - పాయకరావుపేట: వచ్చే నెల 2వ తేదీన రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామంలో జెసిఆర్ లా ఛాంబర్స్ వద్ద జరిగే మాల మహానాడు అనకాపల్లి జిల్లా కమిటీ సమావేశానికి మాలలంతా తరలిరావాలని మాలమహానాడు పాయకరావుపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి గారా జయబాబు కోరారు. మాలమహానాడు జిల్లా కమిటీ భవిష్యత్ కార్యాచరణ, నూతన కమిటీ ఏర్పాటు జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి మాలమహానాడు జాతీయ గౌరవ అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ హాజరవుతారని తెలిపారు.

మండల జేసీఎస్ ఇన్‌చార్జిగా కళ్యాణం



విశాలాంధ్ర - జి.మాడుగుల: జి.మడుగుల మండలానికి చెందిన లంకెల కళ్యాణానికి వైఎస్ఆర్సిపి జెసిఎస్ మండల ఇన్చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మికి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ తమర్బ నర్సింగ్ రావుకి ప్రత్యేకమైనటువంటి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అధిష్టానం నాపై ఉంచిన నమ్మకానికి కట్టుబడి ఉంటానని అన్నారు. జిమాడుగుల మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నుర్మాని మత్య కొండం నాయుడు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ నాగూర్ బాబు, లువ్వా సింగి ఎంపిటిసి జి ఎస్ దొర, మండల సర్పంచ్ పోరము అధ్యక్షులు ఎస్ రామకృష్ణ, సర్పంచ్ కీముడు రాంబాబు, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు కళ్యాణం నియామకం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

యునైటెడ్ బాప్టిస్ట్ చర్చ్‌లో ఘనంగా యూత్ రిట్రీట్

విశాలాంధ్ర - మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు పరిధి కళానగర్ లో గల యునైటెడ్ బాప్టిస్ట్ చర్చ్ లో సంఘ కాపరి రెవ.బర్నబాస్ ప్రేమ్ దాస్, అధ్యక్షులు మణికుమార్ ఆధ్వర్యంలో యూత్ రిట్రీట్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్రదర్ హనీ జాన్సన్, ఓబిసిసి మినిస్ట్రీస్ హాజరై యువతకు మీరు ఎవరిని అనుసరిస్తున్నారు. యువత వారి నడవడిక అనే అంశంపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తుమార్గం అనుసరణీయమని,లోక రక్షణకు క్రీస్తు రక్తాన్ని చిందించారని,నేటి యువత చెడు మార్గాలను వీడి శాంతియుతంగా జీవించాలని బోధించారన్నారు. బ్రదర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ..యువత సన్మార్గంలో నడవాలని,భక్తి శ్రద్ధలతో మెలగాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నూకవరపు బాబ్జి, కార్యదర్శి శశికాంత్, సంఘ యూత్ మెంబర్స్ పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాద మృతుల కుటుంబాలకు
రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: సాహితి ఫార్మా ప్రమాద సంఘటనలో మృతి చెందిన ఇద్దరు కుటుంబాలకు 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం లాలం కోడూరు గ్రామంలో గల అచ్యుతాపురం(డి-నోటిఫై ఏరియా) నందు, సాహితి ఫార్మా ప్రైవేటు లిమిటెడ్ నందు సాల్వెంట్ లోడింగ్ సందర్భంగా ప్రొడక్షన్ బ్లాక్ వద్ద మంటలు చెలరేగగా సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అగ్నిమాపక శాఖ, కర్మాగారాల శాఖ, రెవిన్యూ డిపార్ట్మెంట్, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తదితర శాఖల అధికారులు, వెంటనే ప్రమాద స్థలమునకు వెళ్లి సహాయ చర్యలు చేపట్టారని తెలిపారు. సాయంత్రం 4.30లకు మంటలు అదుపులోకి వచ్చాయని అన్నారు. గాయపడిన వారిలో పైలా సత్తిబాబు, ఉప్పాడ తిరుపతిరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు తెలిపారు.

సదరు ప్రమాదంపై విచారణ చేసి సమగ్ర నివేదిక కొరకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఎ.పి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవిన్యూ డివిజనల్ అధికారితో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వాగ్వివాదాల నడుమ మున్సిపల్ సమావేశం

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ సమావేశంలో జనసేన, వైసిపి కౌన్సిలర్ల మధ్య సమస్యలపై కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. మున్సిపల్ చైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నర్సీపట్నం మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ వాగ్వాదం కాస్త, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర మీదకు మళ్లీ తీవ్రస్థాయిలో వాక్ వివాదం జరిగింది. జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ పనులు చేపడతామని చెబుతున్నారని, మధ్యలో వదిలేస్తున్నారని, ఇలా మధ్యలో వదిలేస్తే సహించేది లేదని జనసేన ప్రజల పక్షాన పోరాడు తుందని మాట్లాడారు. ఈ దశలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు జోక్యం చేసుకొని మున్సిపాలిటీలో చేపట్టే పనులు ఏవి మధ్యలో ఆపడం జరగదని, మీ నాయకుడు పవన్ కళ్యాణ్ మాదిరిగా గ్యాప్, గ్యాప్, సమావేశాలు లాగా మా అభివృద్ధి పనులు ఉండవని వ్యాఖ్యానించారు. 16 వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి మాట్లాడుతూ తన వార్డులో సమస్యలపై ఎన్నిసార్లు ఇంజనీరింగ్ అధికారులకు చెప్పిన పట్టించుకోవటం లేదని సమావేశంలో ఫిర్యాదు చేశారు. విద్యుత్ సమస్యలపై ,ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన ఏఈ రవి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్య పట్టారు. నిర్ణీత సమయానికి తెలుగుదేశం కౌన్సిలర్లు సమావేశ మందిరంలోకి వచ్చారు. అప్పటికీ వైసీపీ కౌన్సిలర్లు రాలేదు. చైర్పర్సన్ వచ్చి ఆమె సీట్లో కూర్చున్నారు. ఆ వెంటనే 26వ వార్డు కౌన్సిలర్ పద్మావతి నాయకత్వంలో, టిడిపి కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోయారు. వారి వెనకే మీడియా వెళ్లింది. మున్సిపల్ కార్యాలయం ఆవరణలోనే, 26 వార్డ్ కౌన్సిలర్ పద్మావతి విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో కమీషనర్ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని, తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. పారిశుద్ధ్య పేరుతో లక్షల రూపాయలు దోచేస్తున్నారని కమిషనర్ పై ధ్వజమెత్తారు. అంతకు ముందు సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు , మరో కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ టీడీపీ కౌన్సిలర్లు తమ రాజకీయ వేదికగా మున్సిపాలిటీ వాడుకుంటున్నారని సమావేశంలో ఆరోపించారు.

విద్యుత్ సౌకర్యాన్ని తక్షణమే పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని కిల్లో గుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని పాఠశాల విద్యకమిటీ చైర్మన్ టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సుమారు 300 మంది గిరిజన విద్యార్థులు వసతి గృహంలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. పాఠశాల ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా ఇప్పట్టి వరకు వసతి గృహంలో విద్యుత్ సదుపాయం లేక విద్యార్థులు అంధకారంలో గడుపుతూ భయాందోళనతో గడపాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - వి. ఆర్. పురం: జూలై 4వ తేదీన విజయవాడలో జరిగే పోలవరం మహా ధర్నాను నిర్వాసితులు ప్రజలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనేం సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చొక్కనపల్లి గ్రామంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తొడం రాజు, గుండెపూడి లక్ష్మణరావు, నాళ్లారపు ప్రకాశరావు, ఆత్మకూరి కాంతారావు, నాళ్ళా రపు చంద్రరావు, వార్డు నెంబర్ గొంది దారయ్య, మాజీ సర్పంచులు బూమమ్మ, పులి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళిత చైర్ పర్సన్‌ను అవమానపరచడం తగదు

విశాలాంధ్ర - నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపల్ సమావేశంలో తొలిసారిగా చైర్మన్ హెూదాలో కూర్చున్న నన్ను టిడిపి కౌన్సిలర్లు అవమానించారని చైర్పర్సన్ సుబ్బలక్ష్మి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కౌన్సిల్ సమావేశం ముగిసిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ చైర్ పర్సన్ గా తొలిసారిగా సమావేశ మందిరంలోకి వచ్చి అందరికీ అభివాదం చేశానని చెప్పారు. ప్రతిపక్షానికి చెందిన జనసేన కౌన్సిలర్ కూడా తన అభినందించారని అన్నారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి 26వ వార్డు కౌన్సిలర్ పద్మావతి నాయకత్వంలో సమావేశానికి హాజరైన టిడిపి కౌన్సిలర్లు కనీసం తనకు అభినందనలు చెప్పకపోవడం చాలా బాధాకరమని అన్నారు. సమావేశానికి వచ్చి కౌన్సిల్లో సమస్యలు ప్రస్తావించకుండా ఒక దళిత మహిళ చైర్పర్సన్ సీట్లో కూర్చోవడానికి సహించలేక వాకౌట్ చేయడం ఏమిటని చైర్పర్సన్ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైస్ చైర్మన్ కూడా పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడేలా వైకాపా ప్రభుత్వం రూపొందించిన జగనన్న సురక్ష పథకాన్ని మన్యప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ఏ పథకాన్ని రూపొందించిన ఆ పథకం ప్రజలకు వరమే అన్నారు. ఇందులో భాగంగానే నేడు అధికారికంగా ప్రారంభించనున్న జగనన్న సురక్ష పథకం ప్రజలందరి సంక్షేమానికి దోహదపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు ఎంతమంది ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు. మరెంతమంది అర్హత ఉండి ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంటున్నారో తెలుసుకుని అర్హులందరూ సంక్షేమ పథకాలు అందుకునేందుకు ఈ పథకం దోహద పడుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న ప్రభుత్వ పథకాలను మన్య ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.

యువతను సన్మార్గంలోకి తీసుకురావడమే పీఎంఈజీపి పథకం లక్ష్యం



విశాలాంధ్ర - చింతపల్లి : చెడు మార్గం నుండి సన్మార్గంలోకి మారి భవిష్యత్తును బంగారు బాట గా మలచుకోవాలని ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పిఎంఈజీపి) వరమని స్థానిక ఏఎస్పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. మావోయిస్టు కార్యకలాపాలలో పాల్గొన్నవారు, మావోయిస్టు కార్యకలాపాలకు ఆకర్షితులయ్యేవారు, దుర్వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు, గంజాయి సాగు, అక్రమ రవాణా లతో పాటు చెడు మార్గాలలో జీవితాన్ని నాశనం చేసుకుంటున్న 18 ఏళ్ల పైబడిన వారిని గుర్తించి అటువంటి వారిలో మార్పు తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా చేపట్టిన పీఎంఈజీపి లో భాగంగా అర్హులైన గిరిజనులకు సూక్ష్మ మరియు చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుని జీవితాన్ని బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకునే బృహత్తర అవకాశం కల్పించడమే లక్ష్యంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో చింతపల్లి, జీక వీధి, కొయ్యూరు మండలాలకు చెందిన వారే గాక ఇతర మారుమూల ప్రాంతాలకు చెందిన పలువురికి స్థానిక పోలీస్ సమావేశ మందిరంలో చింతపల్లి, జీకే వీధి సర్కిల్ ఇన్స్పెక్టర్లు రమేష్, అశోక్ కుమార్ ల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఎస్పి ప్రతాప్ శివ కిషోర్, బ్యాంకర్లు టి శ్రీనివాస్, ఎన్ రవితేజ లు మాట్లాడుతూ గిరి యువత సన్మార్గంలో ఉండేందుకు వారికి ఉపాధి అవకాశాలు మరియు ఆదాయ వనరులు పెంచడమే లక్ష్యంగా పీఎంఈజీపి పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, అన్నవరం, ఎస్సైలు అరుణ్ కిరణ్, వెంకటరమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

3 నుండి జగనన్న సురక్ష శిబిరాలు

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలో జూలై మూడవ తేదీ నుండి జగనన్న సురక్ష శిభిరాలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి, జిల్లా పౌర సంభందాల అధికారి పి. గోవింద రాజులు తెలిపారు. జూలై 3వ తేదీన పెద లోచిలి, వంతల, 05వ తేదీన సొలభం -1, గదుతూరు, 07వ తేదీన గెమ్మెలి, వంజరి -1 11వ తేదీన, పాల మామిడి, వంజరి-2బీ 13వ తేదీన కోరాపల్లి, పెదలువ్వసింగి 15వ తేదీన, జి.మాడుగుల-1, సింగర్భబీ 18వ తేదీన, కె. కోడపల్లి, జి.మాడుగుల -2, 21వ తేదీన నుర్మతి, భీరంబీ 24వ తేదీన బొయితిలి, సొలభం -2 గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ప్రత్యేకాధికారి తెలిపారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కొయ్యూరు: నేటి నుండి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో లాలం సీతయ్య, తహసిల్దార్ తిరుమలరావు కోరారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ జూలై 1 నుండి 26 వరకు కొయ్యూరు మండలంలో గల 23 గ్రామ సచివాలయాలలో రెండు బృందాలుగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటిగా జూలై 1 న డౌనూరు రావణాపల్లి పంచాయతీల లోను, జులై 3న చిట్టింపాడు రాజేంద్రపాలెం సచివాలయాల పరిధిలోను జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా పంచాయతీల పరిధి ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో, తహసిల్దారులు కోరారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసి, బదిలీపై వెళ్ళిన సుమారు 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులను శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. అలాగే కొత్తగా వేర్వేరు ప్రాంతాల్లో పని చేసి ఇక్కడ నాలుగు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు జాయిన్ అయిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. వీరిలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, స్కూల్ గేమ్స్ ఉపాధ్యాయులు వున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం.లు, తల్లితండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న కాలనీలో గడపగడపకు విశేష స్పందన

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ 28వ వార్డులో 75 లక్షల రూపాయలు వ్యయంతో సిమెంట్ రోడ్లు నిర్మించామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వెల్లడించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఈ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డు ప్రజలు చేసిన విన తులను, ఆయన నోట్ చేసుకున్నారు. గడపగడపకు ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ వచ్చినప్పుడు, మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ లు కోనేటి రామకృష్ణ , తమరాన అప్పలనాయుడు , మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, 28వ వార్డు వైసిపి నాయకులు గంటా లలిత, జాన్, నర్సీపట్నం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏకాశివ, కో ఆప్షన్ కౌన్సిలర్ ఎండి భాష , వైసిపి నాయకులు యాదగిరి శేషు, ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ ఆరుగొల్లు రాజబాబు, అయ్యరక కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ చోటి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్‌గా మరియాదాస్

విశాలాంధ్ర - కూనవరం: వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు ఆవుల మరియదాసు జగనన్న సచివాలయ కన్వీనర్గా నియమితులైన సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో నిబద్ధతగల కార్యకర్తగా పేరున్న మరియదాసుకి ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తనకు అప్పజెప్పిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలి



విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రంలో రోజు రోజుకి ఎవరి అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు పెరిగి పోతుందని, అక్రమ నిర్మాణాలను వెంటనే అపాలని స్థానిక సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ, పలువురు వార్డు సభ్యులు, పంచాయితీ పెద్దలతో పాటు తహశీల్దార్ రాజ్యలక్ష్మిని కోరారు. శుక్రవారం వారు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పంచాయితీలో వార్డు సభ్యులతో చేసిన తీర్మాణాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎవరి అనుమతి లేకుండా గిరిజనేతరులు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న చెట్లను నరికి, అక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. మండల కేంద్రంలో నల్లపు కనకరాజు అనే గిరిజనేతరుడు ఇటీవల ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న చెట్లను నరికి గిరిజన 1/70 చట్టానికి వ్యతిరేఖంగా ఎవరి అనుమతి లేకుండా అక్రమంగా ఇళ్ళ నిర్మాణం చేపడుతున్నాడని వారిపై రెవిన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎన్నారు. ఈ కార్యక్రమంలో మాజి జడ్పిటీసీ సభ్యురాలు కొర్ర కాసులమ్మ, వైస్ సర్పంచ్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కొరియన్ భాష నేర్చుకొంటే అధిక ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కొరియన్ భాష నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, అలా కియా కంపెనీలో చాలా మందే ఉద్యోగాలు సంపాదించారని కొరియన్‌లోని సాంగోక్ యూనివర్సిటీ అంబాసడర్ కిమ్ హాంగ్ జాయ్ స్పష్టం చేశారు. కొరియా భాష నేర్చుకునేందుకు విశాఖలోని ద్వారకానగర్ లోని ఇన్నార్ భవనంలో జూలై 1నుంచి కోర్సులు ప్రారంభం కానున్నాయని, మేయర్ గోలగాని హరి వెంకట కుమారి శనివారం కోర్సును ప్రారంభించనున్నారని ఆయన మీడియాతో చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలుంటే కొరియాలో అనేక ఉద్యోగాలు భారతీయుల కోసం ఎదురు చూస్తున్నాయని, ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అనేక మంది 102, పాలిటెక్నిక్, ఐటీఐ చదివి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నవారు, టెక్నికల్ స్కిల్స్ కలిగిన ఫిట్టర్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్, డీజిల్ మెకానిక్, ఎలెక్ట్రికల్ విభాగాల్లో నైపుణ్యమున్న వారికి కొరియా భాషలో కనీస పరిజ్ఞానము0టే అక్కడ నెలకు కనీసం రూ. లక్ష వేతనం లభించే అవకాశాలున్నాయన్నారు.

కొరియన్‌లోని సాంగొక్ యూనివర్సిటీ అంబాసిడర్ కిం హాంగ్ ప్రస్తుతం విశాఖ పర్యటనలో ఉన్నారని, భవిష్యత్తులో విశాఖ అంతర్జాతీయ నగరం కానుందని అన్నారు. కొరియా నేర్చుకోవడానికి పెద్ద నగరాల్లో రూ.10 నుంచి 20వేల వరకు ఫీజులుంటాయని, ఇక్కడ మాత్రం కేవలం రూ.7వేలకే కనీస పరిజ్ఞానం వచ్చేలా చేస్తారన్నారు. ఆన్ లైన్, వారాంతపు కోర్సులు కూడా అందుబాటులో ఉంటాయని, ఆసక్తి ఉన్నవారంతా మరిన్ని వివరాలకు 8790279628 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో యాక్ సాక్ కొరియన్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ పబ్లిక్ వర్క్స్‌లో కొన్ని విభాగాలు విలీనం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ పబ్లిక్ వర్క్స్ లో కొన్ని విభాగాలను విలీనం చేస్తున్నట్లు జీవిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వీఎంఆర్డిఏ చిల్డ్రన్ హెరీనా థియేటర్లో వార్డు సచివాలయ ఎమినిటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవిఎంసి ఇంజనీరింగ్ పబ్లిక్ వర్క్స్ లో జీవిఎంసి విద్యుత్తు, మొక్కల విభాగం, గ్రీనరీ జంక్షన్ల అభివృద్ధి మొదలైనవి విలీనం చేసి ఆ బాధ్యతలను ఆయా సచివాలయ పరిధిలోని ఎమినిటీ కార్యదర్శులకు అప్పజెప్పడం జరిగిందని తెలిపారు. వార్డ్ సచివాలయ పరిధిలోని ఇమ్యూనిటీ కార్యదర్శులు ఇకపై ఆయా వార్డులోని రోడ్లు, వీధి దీపాల నిర్వహణ, మొక్కల సంరక్షణ, జంక్షన్ల అభివృద్ధి లాంటి విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ఆయా వార్డుల పరిధిలోని ప్రధాన గెడ్డలలోని వ్యర్థాల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కార్యదర్శులు వర్షపు నీటి నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలు ముంపుకు గురి కాకుండా చూడవలసిన బాధ్యత కార్యదర్శులదేనని తెలిపారు. జులై 1వ తేదీ నుండి స్వచ్ఛ సర్వేక్షణ 2023 లో అందరూ పాల్గొని సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని, అలాగే మీ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరిచే ఫీడ్ బ్యాక్ చేయించాలని తద్వారా విశాఖ నగరాన్ని స్వచ్ఛ సర్వేక్షన్ లో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీరు రవి కృష్ణంరాజు, డిడిహెచ్ దామోదర్ రావు, పర్యవేక్షక ఇంజనీర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఉపకార్య నిర్వహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు, ఇమ్యూనిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకం దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి: జులై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న సురక్ష పథకం దేశానికే ఆదర్శమని ఆ పథకం ద్వారా లబ్ధిదారులకు సుమారు 12 రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం జరుగుతుందని వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు, పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత నివాసంలో చింతపల్లి, జీకే వీధి జడ్పిటిసి సభ్యులు పోతురాజు బాలయ్య, కిముదు శివరత్నం, జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి లతో కలిసి పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019 ఎన్నికలలో మేనిఫెస్టో ఇచ్చిన హామీలలో 99% గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి సచివాలయ, గ్రామ వాలంటీర్ వ్యవస్థ ల ద్వారా గడపగడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంతృప్తికరంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సభ్యులు దాసరి దారలక్ష్మి (పద్మ), చిందాడ జయలక్ష్మి, తాజంగి, దామనపల్లి సర్పంచులు వంతల మహేశ్వరి, కుందరి రామకృష్ణ, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుకు ఇర్మియా, వైకాపా చింతపల్లి, జీకే వీధి మండల అధ్యక్షులు మోరి రవి, బొబ్బిలి లక్ష్మణ్, వసుపరి వరప్రసాద్, వీరోజి త్రిమూర్తులు, నాయకులు కంకిపాటి గిరిప్రసాద్, పిండి రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

దున్నే వాడిదే భూమి స్పష్టం చేస్తున్న గిరిజన చట్టాలు

విశాలాంధ్ర - అనంతగిరి: గిరిజన ప్రాంతంలో 1/70 చట్ట ప్రకారం ఆదివాసులైన వారికి దున్నే వారిదే భూమి అని స్పష్టం చేస్తున్న రాజుల భూములు ఎక్కడ ? అని గిరిజనులు ప్రశ్నించారు. గిరిజన ప్రాంతంలో పూర్వం మాకు చెందిన భూములు మాకు ఇప్పించాలని న్యాయస్థానాలను కొందరు గిరిజనేతరులు ఆశ్రయించగా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని స్పష్టం చేసిన నేపథ్యంలో మండల కేంద్రమైన అనంతగిరిలో తాసిల్దార్ రాంబాయి నిర్వహించారు. శుక్రవారం వెలుగు సమావేశ మందిరంలో ఈ భూముల వ్యవహారంపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. 8 గ్రామాలలో సుమారు 317 ఎకరాలకు గాను ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, జిల్లా పరిషత్ సభ్యులు గంగరాజు, అనంతగిరి, ఎగువశోభ, టోకూరు, కొండిబ, సర్పంచులు, ఎనిమిది గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు. మేము మా తాతల నుంచి ఈ భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని, అలాగే ప్రభుత్వం కొందరికి గుర్తించి జిరాయితీ, డి ఫారం పట్టాలు ఇచ్చారని ఎప్పుడో పూర్వకాలము లో రాజులు భూములు మావి అంటూ న్యాయస్థానం ఆశ్రయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల గిరిజనులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సర్పంచ్ ల సంక్షేమ సంఘం పిలుపుమేరకు ఈనెల 3న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక మండల సర్పంచులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు కే హరి మాట్లాడుతూ సర్పంచుల విధులు, నిధులపై, పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14 ,15 వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పి సునీత, పి కొములు, జి శారద, ఇది తౌడన్న, జి సుబ్బారావు, బి లచ్చు, అర్జున్ ,కమల, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర - పరవాడ; పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ పరవాడ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు వీ.వీ రమణ మాట్లాడుతూ ఇప్పటికే నిత్యవసరాల ధరలు పెరిగి నానా ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ప్రభుత్వం మరోసారి విద్యుత్ చార్జీలు పెంచడంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా పరిస్థితి నెలకొందని విమర్శించారు. 2014 నుండి 2023 వరకు వాడిన విద్యుత్‌కు బిల్లులు కట్టినప్పటికి నష్టం పూడ్చుకోవడానికి విద్యుత్ సంస్థలు ట్రూఆఫ్ చార్జీలు, అదనపు చార్జీలు సర్దుబాటు పేరుతో మళ్లీ యూనిట్‌కి 80 పైసలు పెంచి ఇప్పుడు కట్టమనడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పేరుతో మరింత దోపిడీ చేస్తోందని మండి పడ్డారు. సీపీఎం నాయకులు పీ.డీ నాయుడు,లోహిత, వెంకటరమణ,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లో టీడీపీ ఓటరు పరిశీలన

విశాలాంధ్ర - కొయ్యూరు : 18 సంవత్సరాల నిండిన వారంతా ఓటరు నమోదు చేయించుకోవాలని తెదేపా మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు పిలుపునిచ్చారు. మండలంలోని బూదరాళ్ల పంచాయతీ మారుమూల బాలరేవుల బూదరాళ్ల గ్రామాల్లో పంచాయతీ యూనిట్ ఇన్చార్జి కూనిశెట్టి చంద్రరావుతో కలిసి ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా 18 సంవత్సరాల నిండిన వారంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ యూనిట్ ఇన్చార్జి లోతా సింహాచలం బూదరాళ్ల బూత్ కన్వీనర్లు మాదల బుజ్జిబాబు లోవరాజు తెదేపా కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.